## అమ్మవారి సేవలో మంత్రి రోజా

తిరుచానూరు,ఆగస్టు 1 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని సోమవారం రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక మరియు క్రీడల శాఖా మంత్రి ఆర్కే.రోజా దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ మధుసూధన్,ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,అర్చకులు బాబుస్వామి తదితరులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అలాగే ప్రత్యేక కుంకుమార్చన సేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం వేద ఆశీర్వాద మండపంలో మంత్రికి ఆశీర్వచనం,తీర్థ ప్రసాదాలు అందచేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# శాస్త్రవేత్తలుగా విద్యార్థినులు..

### 7న అంతరిక్షంలో అద్భుతం
### ఆజాది శాట్ ప్రయోగ సమయాన్ని ఖరారు చేసిన ఇస్రో

ఆజాది శాట్‌ను తయారు చేస్తున్న విద్యార్థినులు, 8 కిలోల బరువైన ఆజాది శాట్ ఉపగ్రహం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 1 ప్రభాతవార్త

అన్ని రంగాలలాగే అంతరిక్ష రంగంలోనూ మహిళలు ధీటుగా ఎదగాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఒక ఉపగ్రహాన్ని రూపకల్పన చేయడానికి అందరూ బాలికలనే శాస్త్రవేత్తలుగా ఎంపిక చేసుకుంది. 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆజాది శాట్ పేరుతో 750 మంది విద్యార్థినులు రూపకల్పన చేసిన ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెడుతోంది. ఈ నెల 7న ఉదయం 9.18 గంటలకు ఈ ఉపగ్రహాన్ని స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో మొదటి రాకెట్ ద్వారా అంతరిక్షంలో ప్రవేశపెట్టనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ఉపగ్రహ తయారీలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఎంపిక చేసిన 75 పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు పని చేశారు. ఉమెన్ ఇన్ స్పేస్ అనే ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన విధానానికి అనుగుణంగా సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ (ఎస్‌టిఈఎం) విభాగాలలో మహిళలను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం అంతరిక్ష ప్రయోగానికి ఎంపిక చేసుకుంది. దీనికి ఇస్రో సహకరించడంతో స్పేస్ కిడ్స్ ఇండియా ఈ విలక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. దేశంలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో 8 నుంచి 12వ తరగతి చదువుతున్న వారికి ఈ అవకాశం దక్కింది. ఏపీలోని మూడు పాఠశాలల విద్యార్థినులు హాజరవుతున్నారు. తిరుపతి జిల్లా నారాయణవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంతపురం జిల్లా కురుగుంట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, తూర్పుగోదావరి జిల్లా వీరలంకపల్లె బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు కూడా ఉన్నారు.

# ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం

### - కలెక్టర్ హరినారాయణన్

ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:

ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైందని దీనికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరినారాయణన్ డిఆర్ఓ రాజశేఖర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు గుర్తింపు కార్డులో ఆధార్ అనుసంధానం ప్రక్రియ చేపట్టడానికి బిఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు ప్రత్యేక శిబిరాలను శని, ఆదివారాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఓటర్లుగా నమోదు అయిన వారి నుండి ఆధార్ నెంబర్‌ను సేకరించడానికి కొత్త ఫారం-6బిని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తిగా స్వచ్ఛంధమని ఆధార్ వివరాలను పూర్తిగా గోప్యతతో వుంటాయన్నారు. ఓటరు జాబితా నుండి మల్టిపుల్ ఎంట్రీలు, డూప్లికేట్, రిపీట్, మరణించిన వారిని తొలగింపుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పూర్తి వెరిఫికేషన్ తప్పనిసరిగా చేసి జాబితా నుండి తొలగించాల్సి వుంటుందన్నారు. అలాగే ఫారం-7కు సంబంధించి ఇకపై మరణ ధృవీకరణ పత్రంను జత చేయాల్సి వుంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోనే కాకుండా ఇతర నియోజకవర్గాలకు ఓటరు మార్పు, నూతన ఓటరు గుర్తింపు కార్డు జారీ, వైకల్యం వున్న వ్యక్తిని గుర్తించడం వంటి అంశాలకు సంబంధించి ఫారం-8లో మార్పులు చేయడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుకు సంబంధించి 2023 జనవరి 1 నాటికి 19 సంవత్సరాలు పూర్తి అయిన వారు ముందస్తుగా దరఖాస్తులు చేసుకొనే అవకాశం భారత ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ ఒకటవ తేదీల్లో నమోదు చేసుకోవచ్చునన్నారు. అలాగే ప్రత్యేక ఫోటో ఓటర్ల జాబితా 2023 సవరణలు ఈ నెల 4 నుండి అక్టోబర్ 24 వరకు వుంటుందన్నారు. అలాగే ఇంటింటి సర్వే, నవంబర్ 9న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకటన, డిసెంబర్ 8వ తేదీ వరకు అభ్యర్థనలు, వాదనల పరిశీలన, 2023 జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురణ వుంటుందన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, కుప్పం ఆర్డీఓ శివయ్య, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, బిసీ, కాపు కార్పొరేషన్ ఇడి సుబ్రమణ్యం, బిజెపి నాయకులు జగదీశ్వర్‌నాయుడు, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శ కోదండయాదవ్, బహుజన సమాజ్ పార్టీ నుండి అశోక్‌కుమార్, సిపిఐ నుండి నాగరాజు, సిపిఎం నుండి గంగరాజు, జనసేన నుండి దయారాం, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డిటి పార్థసారధి, ఇడిటిలు, ఇఆర్ఎస్ఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బోగస్ ఓటర్లకు ఇక చెక్

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త

కొందరికి రెండు, మూడు ఓట్లు ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం వాటిని తొలగించేందుకు అధునాతన సాంకేతికత (ఫొటో సెమిలర్ ఎంట్రీ) సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఓటర్ల జాబితాలో ఒకే తరహా ఫొటో ఉన్న కొందరిని గుర్తించి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఓటరుకు ఆధార్ అనుసంధానం అమలు చేయాలని తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఒక మనిషికి ఒకే ఆధార్ సంఖ్య ఉండటంతో ఈ ప్రక్రియ వందశాతం పూర్తయితే బోగస్ ఓట్లకు చెక్ పడనుంది. మృతుల వివరాలు కూడా వెలుగులోకి రానున్నాయి. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఓటరుకు సంబంధించిన ఆధార్ వివరాలను సేకరించి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు ఫారం-6బి పూర్తి చేసి ఇవ్వాలి. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఏదో ఒక గుర్తింపు కార్డు ఇవ్వాలి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో అనుసంధానం చేస్తున్నారు. ఆ మేరకు ఓటరుకు ఆధార్ అనుసంధానంపై పైఅధికారులు కూడా తమకు శిక్షణ ఇచ్చారని తహశీల్దార్ పద్మావతి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని త్వరలోనే ఇంటింటికి వెళ్లి బూత్‌స్థాయి అధికారులు ఆధార్‌కార్డుకు ఓటును అనుసంధానం చేస్తారని తహశీల్దార్ తెలిపారు.

## జానపదానికి జనసంద్రమైన శోభాయాత్ర

తిరుమల,ఆగస్టు 1 ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలక్షేత్రంలో అఖండహరినామసంకీర్తన మొదలవడంతో ఆధ్యాత్మికనగరం తిరుపతిలో జనసంద్రంగా కళాకారుల శోభాయాత్ర సాగింది. సోమవారం ఉదయం తిరుపతిలో గ్రామీణ కళలకు ప్రాణం పోస్తూ జానపద వృత్తి కళాకారుల సంఘం, అన్నమయ్యకళాక్షేత్రం ఆధ్వర్యంలో వేలాదిమంది కళాకారులతో శోభాయాత్ర నగరంలో ఆకట్టుకుంది. తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలనుంచి తరలివచ్చిన కళాకారులతో తిరుపతి నగరం అగ్రభాగాన నిలిచింది. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, సినీనటుడు సుమన్, మాజీ ఎంపి మధు, మహిళా సంఘం రాష్ట్రనాయకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో
# ఇద్దరు యువకులు దుర్మరణం

### - ఒకరికి తీవ్రగాయాలు..

మృతి చెందిన భరత్, ఆదిత్యల ఫైల్‌ఫోటో

శాంతిపురం, ఆగస్టు1ప్రభాతవార్త

శాంతిపురం మండలం కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో కడపల్లి వద్ద శనివారం అర్ధరాత్రి ఓ కారు మితిమీరిన వేగంతో వచ్చి బాత్రూము గదిని ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. కుప్పంకు చెందిన ప్రముఖ న్యాయవాది నటరాజన్ కుమారుడు ఈశ్వర్ ఆదిత్య (సాకేత్), రైల్వే మాజీ ఉద్యోగి రాధా కుమారుడు, డికెపల్లి పంచాయతీ కార్యదర్శి భరత్ (30)లు ఈ ప్రమాదంలో మృతి చెందారు. కుప్పంకు చెందిన త్యాగరాజు తీవ్రగాయాలపాలై పిఇఎస్‌లో చికిత్స పొం దుతున్నాడు. ఈమేరకు రాళ్లబూదుగూరు ఎస్సై మునస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భవిష్యత్ సేవా కార్యక్రమాలకు
# కొత్తఢిల్లీలో రాస్ సేవానిలయం

తిరుపతి,ఆగస్టు 1 ప్రభాతవార్త:

సమాజంలో పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి, వారికి ఆదరణగా నిలిచేందుకు మొదలైన రాష్ట్రీయసేవా సమితి(రాస్)ను దివంగత గుత్తా మునిరత్నం నాయుడు సేవాభావంతో నడిపించారని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఇప్పుడు భవిష్యత్‌తో పేదలు, బలహీన వర్గాల ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా రాస్ ఆధ్వర్యంలో కొత్తఢిల్లీలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో నిర్మించిన సేవానిలయాన్ని సోమ వారం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. మునిరత్నంనాయుడు ఆదర్శాలతో, సేవా భావంతో ప్రతి రాస్ కార్యకర్త నడిచి పేదలకు, మహిళలకు, రైతులకు మరింత సేవచేయాలని ఆకాంక్షించారు. గత నాలుగుదశాబ్దాల రాస్ సేవలను కొనియాడారు. రాస్ ఉపాధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శి మమత, కార్యనిర్వాహక సభ్యులు వి.బాలాజీనాయుడు, రాజశేఖర్‌నాయుడు, బాలాజీచౌదరి, వెంకటరమణచౌదరి, కృష్ణమూర్తి, బాబునాయుడు, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఫైల్డ్‌ఫండ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : ఎస్పీ

తిరుపతి,ఆగస్టు 1 ప్రభాతవార్త:

పలు రకాలుగా బాధితులు తమతమ సమస్యలపై స్పందనకు ఇచ్చే ఫిర్యా దులను త్వరగా పరిష్కరించి న్యాయం చేయాలని తిరుపతి ఎస్పి పి.పరమే శ్వరరెడ్డి అదికారులకు ఆదేశించారు. సోమవారం ఉదయం తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్య క్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన బాధితులు తమతమ సమస్యలపై ఎస్పికి ఫిర్యాదు చేశారు. వీటన్నిటినీ సానుకూలంగా పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# స్పందనకు 169 అర్జీలు

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై 169 విన్నపాలు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంను కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 133, హౌసింగ్ 5, డ్వామా 4, పోలీసు శాఖ 3, డిఎస్ఓ 2, సంక్షేమ శాఖలు 6, ఇతర శాఖలకు సంబంధించి 16 అర్జీలు అధికారులకు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## 15 వరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు

### - హర్ మార్ తిరంగా నినాదంతో జిల్లా, మండల, సచివాలయ స్థాయిలో పండుగ

*చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:*

*దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఈ ఆగస్టు 15 నాటికి 75 సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంతో దేశ పౌరుల్లో దేశ భక్తిని పెంపొందించడానికి ప్రత్యేక నన నన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఆగస్టు 1 నుండి 15వరకు జిల్లా స్థాయి మొదలు మండల, గ్రామ సచివాలయ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పాఠశాల విద్యార్థుల ద్వారా ప్రజలను ఉత్సాహ పరుస్తూ ర్యాలీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, మం గళవారం భారత దేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, తెలుగు నాటకరంగ ప్రముఖులు, ప్రముఖ న్యాయవాది బళ్ళారి రాఘవ జయంతి ఉత్సవాలను నిర్వహించడం, 3వ తేదీ ఆంధ్ర ఉద్యమంలో కీలక నాయకుడిగా పనిచేస్తూ అసువులు బాసిన కాకాని వెంకటరత్నం జయంతి ఉత్సవాలు, చిత్తూరు జిల్లాలో వెలుగులోకి రాని స్వాతంత్ర్య సమరయోధులను స్మరించు కార్యక్రమం నిర్వహణ, 4వ తేదీ పాఠశాల, కళాశాల, యూనివర్సిటీ విద్యార్థులకు దేశ భక్తి పెంపొందించేలా గీతాలాపనపై పోటీలు నిర్వహించడం, 5వ తేదీ కళాశాల, యూనివర్సిటీల్లో దేశభక్తిని పెంపొందించే నాటికలు, ఏకపాత్రాభినయ ప్రదర్శన నిర్వహణ, 6వ తేదీ దేశభక్తిని పెపొందించే వివిధ ఛాయచిత్రాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.*

# ఖాళీ జాగా కనబడిందా? వేసేయ్ పాగా!!

### శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యథేచ్ఛగా దందా
### ప్రేక్షక పాత్రలో రెవెన్యూశాఖ: పట్టించుకోని ఉన్నతాధికారులు

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలం, పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఖాళీ జాగా కనిపిస్తే వేసేయ్ పాగా అని ఓ టీం పావులు కదుపుతోంది. అయితే ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దాంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి.సామాన్యుడికి ఒక ఇంటి నివేశన స్థలం ఇవ్వాలంటే సవాలక్ష నిబంధనలతో సతమతం చేస్తూ పారదర్శక పాలన అంటూ గొప్పలు చెప్పు కుంటూ పలుకుబడి కల్గిన వారికి రూ.కోట్ల విలువ చేసే భూములను పలహారంగా అందిస్తున్నారు. రాజీవ్ నగర్‌లో ఓ టీం, మండలాల్లో మరి కొన్ని టీంలు పని గట్టుకొని అన్వేషిస్తూ జేబులు నింపుకుంటూ రెవెన్యూశాఖకు కూడా ఎంతో కొంత ముట్టజెబుతున్నట్లు బాహాటంగా విమర్శలు వినబడుతున్నాయి. మరి జిల్లా ఉన్నతాధికారులకు తెలియదా? అంటే అబ్బే మాకేం ఫిర్యాదులు రాలేదే అని తప్పించుకుంటున్నారు.**

రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి రెడ్డిగుంటను చదును చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో విచ్చల విడి అక్రమ విక్రయాలకు రెవెన్యూశాఖ మద్దతు ఉందనేది సుస్పష్టం. 2009లో రద్దు చేసిన పట్టాలు,ప్లాట్ల సమాచారం దళారులకు ఎలా తెలుస్తుంది? ఈ పట్టాలు మాత్రమే విక్రయాలు జరుగుతుంటే ఫిర్యాదులందినపుడు సహించేది లేదని మేకపోతు గాంభీర్యాన్ని రెవెన్యూ శాఖ ప్రదర్శించటం గమనించదగ్గ విషయం. ఇక శ్రీకాళహస్తి మండలంలోని ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఎక్కడ ఖాళీ జాగా ఉంటే వేసేయ్ పాగా అని రెవెన్యూ అధికారుల సహకారం,రాజకీయ మద్దతు ఉన్న వారు ఆక్రమించుకుంటుంటే పట్టించుకునే దిక్కులేదు. ఇక నీటి గుంటలను మూసివేస్తుంటే ఇరిగేషన్ శాఖకు కనపడకపోవడం గమనార్హం. ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో రెడ్డి గుంట ఉంది. ఈ గుంటను రెండు రోజులుగా యథేచ్ఛగా చదును చేస్తుంటే రెవెన్యూ అధికారులకు తెలియదట! శ్రీకాళహస్తి మండలంలో ప్రభుత్వ భూములు విచ్చల విడిగా ఆక్రమణలకు గురౌతుండగా పట్టించుకునే దిక్కులేదు. ఇటీవల ఇనగలూరు వద్ద అపాచి పరిశ్రమకు సిఎం శంకుస్థాపన చేసారు.దాంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు మళ్ళీ రెక్కలొచ్చాయి. దాంతో కబ్జాదారులు ఎక్కడ ప్రభుత్వ భూములు ఖాళీ ఉంటే అక్కడ కన్నేస్తున్నారు. పక్కా ప్రణాళికను రూపొందించుకొని తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఎవరైనా రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంటే నీ అంతు చూస్తామనే స్థాయికి అక్రమణదారులు తయారయ్యారు.ఈ నేపథ్యంలో రెడ్డి గుంట భూముల ఆక్రమణ.

**రహదారి పక్కన . . .**

శ్రీకాళహస్తి మండలంలోని ఏర్పేడు-వెంకటగిరి రహదారి పక్కన జాతీయ రహదారి -565లో సర్వేనెంబర్ 99-1లో 2.5 ఎకరాలు,99-2లో 0.07 ఎకరాలు మొత్తం 2.57 ఎకరాలు విస్తీర్ణంలో రెడ్డిగుంట ఉంది. రెవెన్యూ రికార్డుల మేరకు కూడా ఇది నీటి కుంటగానే ఉంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ భూమిపై కొంత మంది ద్వితీయశ్రేణి మండల నాయకుల కన్ను పడింది. ఎలాగైనా ఈ భూములను తమ స్వాధీనంలో తెచ్చుకోవటానికి పావులు కదిపారు. ఇందుకోసం ఎంపెడులో అణగారిన వర్గాలకు ఆశ చూపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. తమకు అనుకూలంగా ఉన్న వారి నుంచి విరాళాలను వసూలు చేసారు. 14 మంది సొమ్ములు అందించినట్లు సమాచారం. వారి ముసుగులో రెడ్డి గుంటను రెండు రోజులుగా చదును చేస్తున్నారు.ఈ విషయం రెవెన్యూ శాఖకు తెలియనిది కాదు.రెవెన్యూ రికార్డుల ప్రకారం రెడ్డిగుంట 2.57 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఇందులో 1.5 ఎకరాలను చదును చేసారు. బారత రాజ్యాంగనిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి ఎవ్వరు వ్యతిరేకం కాదు. అయితే ప్రభుత్వ భూమిలో విగ్రహం ఏర్పాటు చేయాలంటే అధికారుల అనుమతి తప్పని సరి. ఎంపేడు వద్ద రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండానే రెడ్డి గుంటను చదును చేస్తుంటే పట్టించుకునే దిక్కులేదు. వాస్తవానికి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలంటే ఐదు సెంట్లు భూమి చాలు. కానీ 1.5 ఎకరాలుచదును చేయటం అనుమానాలకు తావిస్తుంది.అణగారిన వర్గాలనుఅడ్డుపెట్టుకొని జాతీయ రహదారి పక్కన కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించుకొని భవిష్యత్తులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయటానికి పథకం ప్రకారం పావులు కదుపుతున్నారు.

**రెడ్డిగుంట పనులను ఆపేశాం:**

ఎంపెడు వద్ద రెడ్డిగుంటకు సంబంధించిన వివాదానికి సంబంధించి శ్రీకాళహస్తి మండల తహశీల్దార్ జరీనాను వివరణ కోరగా రెవెన్యూ శాఖ అనుమతి లేకుండానే పనులు చేపట్టారని తమ సిబ్బందివెళ్ళి అభ్యంతరం పెట్టారని అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చదును చేస్తున్నట్లు వివరించారని తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు రెండు సెంట్లు స్థలం చాలని కానీ అక్కడ ఎకరానికి పైగా చదును చేసారని అందుకే తమ సిబ్బంది అక్కడ పనులు ఆపేసారని ప్రస్తుతం అక్కడ పనులు ఆగిపోయాయని వివరించారు. ప్రభుత్వ భూముల్ని ఎవరు ఆక్రమించుకున్నా ఉపేక్షించమని చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# ఆహారభద్రత చట్టానికి తూట్లు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త

ఆహార భ ద్రత చట్టానికి వైకాపా ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం మండల సచివాలయం ఎదుట దేశం నేతలు ధర్నా చేపట్టారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రకటిం చిన పిఎంజికెవై పథకంలోభాగంగాఉచితబియ్యాన్ని గత నాలుగు నెలలుగా

నిలిపేశారన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్నప్పటికీ కొందరికి మాత్రమే ఇవ్వడంతగదన్నారు. ఈనిర్ణయంఆహారభద్రతచట్టాన్ని ఉల్లంఘించ డమేనన్నారు. 2019కు ముందు దేశం పాలనలో రేషన్ షాపుల్లో రూపాయికే కిలో బియ్యంతో పాటు ఎనిమిది రకాల సరుకు లు అందించేవారన్నారు. ఇప్పుడు పేదలకు కేవలం బియ్యం, చక్కెర మాత్రం ఇస్తున్నారన్నారు. తెల్లరేషన్‌కార్డు దారులకు ఒక్కొక్కరికి 5 కిలోల వంతున ఐదు నెలల బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ లోకేశ్వరరావుకు వినతిపత్రం అందిం చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, రమేష్, ఎల్.జయ రాంరెడ్డి, సుబ్రమణ్యం, జయరాంరెడ్డి, శేఖర్, అనసూయ, రాజారెడ్డి,

## గంగమ్మకు రూ. 68.07లక్షల ఆదాయం

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 1 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 68,07,024లు ఆదాయంగా సమకూరిందని ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఒ చంద్రమౌళిలు తెలిపారు. ఆలయంలో 35రోజులకుగాను లెక్కించిన హుండీలో నగదుతోపాటు 69గ్రాములు బంగారం, 348గ్రాముల వెండి, విదేశీ కరెన్సీని భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. అంతేకాకుండా ఆషాడమాసం కావడంతో భక్తుల తాడికి పెరిగిందనీ జూన్ 29నుంచి జులై 28మధ్యకాలంలో కేవలం వివిధ టిక్కెట్ల రూపేణా రూ. 79,44,702లు ఆదాయం వచ్చిందన్నారు. అదే విధంగా అన్నదానానికి రూ. 2,10,254లు విరాళాలి చ్చారన్నారు. పాలకమండలి సభ్యులు పూర్ణిమారాయల్‌మోహన్, శ్రావణి, భానుప్రకాష్, ఎండోమెంటు ఇన్స్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

చౌడేపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసిడిఎస్ ఎసిడిపిఒ అధికారిణి సరళాదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బయపల్లి, ఖాన్‌సాబ్‌మిట్ట, చింతమాకులపల్లి తదితర అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా ప్రాంత తల్లులతో సమావేశం ఏర్పాటు చేసారు. బిడ్డ జన్మించగానే ముర్రిపాలు పట్టించడం వల్ల పాపాయికి రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా వుంటారన్నారు. సూపర్‌వైజర్ సులోచనా, ఆయా అంగన్‌వాడీల కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## చింతమాకులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

చౌడేపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త

మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ పరిధిలోని ఖాన్‌సాబ్‌మిట్ట, బయపల్లి, చింతమాకులపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. గడచిన 3యేళ్ళల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఆయా ప్రాంత సమస్యలపైదృష్టిసారించారు. మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిపిఏమునితుకారం, జడ్పీటీసీఎన్, దామోధర్ రా జు, ఎంపిపి జి.రామ్మూర్తి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, ఉపాధ్యక్షుడు నరసింహులుయాదవ్, సింగిల్ విం డో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పం చు హైమావతి, ఎంపిటీసీశ్రీరాములు, ఆయాశాఖలఅధికారులు, వైకాపానాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళావేదిక నిర్మాణానికి పూర్వ విద్యార్థుల విరాళం

తవణంపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు కళావేదిక నిర్మాణం కోసం ఈమొత్తాన్ని పాఠశాలకు అందజేశారు. ఈమొత్తాన్ని పూర్వ విద్యా ర్థులు కె.గోపీ, డాక్టర్ శివకుమార్, బి.సునీల్, బి.శ్రీనివాసులు, డి.పురుషోత్త ్తంలుపాఠశాలహెచ్‌ఎంశ్రీరంజని, సహప్రధానోపాధ్యాయనిశాంతిశ్రీ, ఈజె. విజయకృష్ణారెడ్డిలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న ఎమ్మెల్యే బాబు

కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త:

పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రమేష్, బాబు, స్థానిక సర్పంచ్ కెవిఎస్. శాంతిసాగర్‌రెడ్డిపాల్గొన్నారు. ఆలయపునర్నిర్మాణపనులుపూర్తవడంతోఆలయాన్ని కుంభాభిషేకంకు సిద్దం చేయాలని ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఈ వెంకట నారాయణలకు సూచించారు.

## ఏపీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త:

ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో విభాగం నూతనంగా ప్రవేశపెట్టిన పార్సిల్ కొరియర్ సర్వీసు(లాజిస్టిక్స్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు వన్‌డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని అరగొండలో శివ కంప్యూటర్స్‌లో లాజిస్టిక్స్ ఏజెంట్‌ను నియమించి ప్రారంభించి అరగొండలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కలిసి పార్శిల్ కొరియర్ సర్వీసు మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని 84 పట్టణాల్లో 50 కేజీల వరకు వున్న పార్సిల్, కొరియర్‌లను అతితక్కువ ఖర్చుతో సకాలంలో డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ అమర్‌నాథ్, ఎస్టీఐ ప్రసాద్, టీఐ2 మొగిలయ్య, ఏజెంట్ శివకుమార్, యూనియన్ నాయకులు మురళి, ఉపేంద్ర, కుమార్, గిరి, శంకర్‌లతో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మున్సిపల్ ఛైర్మన్ పరామర్శ

కుప్పం, ఆగస్టు 1 ప్రభాతవార్త

కుప్పంకు చెందిన సీనియర్ న్యాయవాది నటరాజన్ కుమారుడు ఆదిత్య, విశ్రాంత రైల్వే ఉద్యోగి రాధా కుమారుడు డికెపల్లి పంచాయతీ కార్యదర్శి భరత్‌లు మృతి చె ందడంతో కుప్పంలో విషాదం చోటు చేసుకుంది. వీరి మృతదేహాలకు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ నివాళులు అర్పించారు. మృతులకుటుంబాలను ఆయన పరామర్శించారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న త్యాగరాజును పరామర్శించారు. కాగా డికెపల్లి సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న భరత్ మృతి పట్ల అధికారులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చిన్నవయసులోనే ఇద్దరు యువకులు మృతి చెందడాన్ని వారి కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## కర్ణాటక మద్యం ప్యాకెట్లతో సహా వ్యక్తి అరెస్ట్

పెద్దపంజాణి, ఆగస్టు 1 ప్రభాతవార్త

కర్ణాటక మద్యంను అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై స్వర్ణతేజ తెలిపారు. మండలంలోని మద్దలకుంట గ్రామానికి చెందిన చెంగలరాయులు కుమారుడు సుబ్రమణ్యం (46) 90 కర్ణాటక మద్యం ప్యాకెట్లు అక్రమంగా నిల్వ ఉంచుకుని ఉండగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

# పేదల కడుపు కొడుతున్న వైకాపా ప్రభుత్వం - తెదేపా

కుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త

రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం పేదల కడుపుకొడుతోందని కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌పేర్కొన్నారు. సోమవారంతహశీల్దార్ కార్యాలయం ఎదుట దేశంనేతలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న ఆహార భద్రత పథకంలో భాగంగా పేదలకు అందించాల్సిన నాలుగునెలలబియ్యంఅందించకుండాకోతలువిధించడం దారుణమన్నా

రు. చౌక దుకాణాల వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. గత టిడిపి పాలనలో రేషన్‌షాపుల్లో బియ్యం, కంది పప్పు, చక్కెర, వంటనూనె, గోధుమపిండి, ఉప్పు, రాగులు తదితరా లు సరఫరా చేస్తే ఇప్పుడు కేవలం బియ్యం, చక్కెరలకే పరిమిత ం మ య్యారన్నారు. పండగ కానుకలు కూడా లేవన్నారు. వివిధ కారణాలు చూపి 18.72లక్షల రేషన్‌కార్డులుతొలగించారన్నారు. అంటూమహిళలనురోడ్ల పైనిల బెట్ట దందారుణమన్నారు. గతంలోమాదిరి చౌక దుకాణాల్లో అన్ని సరుకులు అందేలాచూడాలనిరెవెన్యూఅధికారులకువినతిపత్రంఅందించారు. నేత లుసాంబశివం, ఎవిరవి, శాంతారాం, వల్లెప్ప, వసంతమ్మ, మణి, పళని, గోపి, సంతోష్, నాగభూషణ ం, రాజేష్, నరేష్, పొన్నువేలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తహశీల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ నిరసన

తవణంపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త:

చౌక ధర దుకాణ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మండల టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రేషన్ బియ్యం పంపిణీలో మోసం, రేషన్ కార్డుల అక్రమ తొలగింపు, రేషన్ కోటాలో కోత, నాణ్యతలేని సరుకుల సరఫరా, రేషన్ బియ్యం అక్రమ రవాణా వంటి వాటికి నిరసన తెలియజేస్తూ తహశీల్దార్ కార్యాలయంలో మండల టీడీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌నాయుడు, జొన్నగురకల మధుకుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలు కోదండయ్య, వెంకటేష్ చౌదరి, మాజీ ఎంపీపీ సరళకుమారి, నాయకులు సునీల్ కుమార్ చౌదరి, నాయకులు నటరాజ్, బాబునాయుడు, బీసీసెల్ అధ్యక్షుడు వినాయకం, శరవణ కుమార్, గోపీ యాదవ్, నవీన్, చిట్టెమ్మ, చంద్రశేఖర్‌నాయుడు, శోభన్‌బాబు, సతీష్‌నాయుడు, ఏకాంబరనాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.2.50లక్షల చెక్కు అందజేత

కుప్పం, ఆగస్టు 1 ప్రభాతవార్త

గుడుపల్లె మండలం శ్రీనివాసపురం వద్ద ఏనుగుల దాడిలో మృతి చెందిన తమిళనాడు వాసి గోవింద కుటుంబానికి సోమవారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, చిత్తూరు జిల్లా పశ్చిమ విభాగం అధికారి చైతన్యకుమార్‌రెడ్డిలు రూ 2.50లక్షల చెక్కును అందజేశారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజుకు లక్ష రూపాయల సాయంలో భాగంగా తొలివిడతగా ఇరవై వేలు చెల్లించడంతో పాటు అతని వైద్య ఖర్చులను అటవీశాఖ భరిస్తుందని డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఏనుగుల దాడుల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, గుడుపల్లె కో కన్వీనర్ రామూర్తి, ఎఫ్‌ఆర్‌ఓ మదన్‌మోహన్‌రెడ్డి, డిఆర్వో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి : ఆర్డీఓ

కుప్పంరూరల్, ఆగస్టు1 ప్రభాతవార్త

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13-15 తేదీల్లో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని ఆర్డీఓ శివయ్య పేర్కొన్నారు. సోమవారం కుప్పంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రతి భారతీయుడు గర్వంగా తమ ఇంట్లో జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఎంపిడిఓ విజయ్‌దత్, ఎంఇఒమహబూబ్‌బాషా, కమీషనర్ రవిరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వరబాబు, కేశవులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** ఈనెల 13-15 తేదీల్లో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి కోరారు. రామకుప్పంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్లు చంద్రారెడ్డి, బాబురెడ్డి, సర్పంచులు బివి మురళి, రాజగోపాల్, ఎంపిడిఓ రాధాకృష్ణ, ఎంఇఒ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## రైళ్ల స్టాపింగ్‌కోసం రైల్వే డిఆర్‌ఎంకు వినతి

కుప్పంరూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త

వైజాగ్ - బెంగళూరు వీక్లీ మరియు చెన్నై - సాయినగర్ రైళ్లను కుప్పంలో నిలుపుదల చేయాలని సాయి మాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు సోమవారం బెంగళూరులో రైల్వే ఉన్నతాధికారులు సునీల్, కృష్ణారెడ్డిలకు వినతిపత్రం అందించారు. కుప్పం మూడు రాష్ట్రాల కూడలి కావడంతో పాటు విద్యా సంస్థలతో పాటు రైతుల పంటలసాగు అధికంగా ఉందన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, కిషోర్, బాలసుబ్రమణ్యం, అరవింద్ పాల్గొన్నారు.

## రామకుప్పంలో దేశం నేతల నిరసన

రామకుప్పం, ఆగస్టు 1ప్రభాతవార్త

ఆహార భద్రత చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని తెదేపా నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా అందిస్తున్న సరుకుల్లో నాణ్యత లేదని, కోవిడ్ సమయంనుంచి కేంద్రం అందిస్తున్న ఉచిత బియ్యం నాలుగు నెలలు నిలిపేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, నరసి ంహులు, నాగభూషణ్, పెరుమాళ్, వెంకట్రామిరెడ్డి, రామలింగారెడ్డి, ఎర్రప్ప, చంద్రశేఖర్, మురళి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, బాలాయపల్లి దొరవారిసత్రం,

## తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సరుకులు అందించాలి

చిల్లకూరు ఆగస్టు 1 ప్రభాతవార్త

జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఆదేశాలతో గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సలహాల మేరకు సోమవారం చిల్లకూరు తహసిల్దారు కార్యాలయం ఎదుట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీనాయకులు, కార్య కర్తలు పెద్దఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సరుకులు ఇవ్వాలని గుండాల లీలావతి అన్నారు. అనంతరం వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతు ఇంటిముందుకే రేషన్ బియ్యం, అనే పేరుతో ప్రారంభించి ఎండియు వాహన ఆపరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి సరుకులు అందించడం లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమం సీనియర్ అసిస్టెంట్ బాషాకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పచ్చా వెంకటేశ్వర్లునాయుడు, టిడిపి నాయ కులు యదనపర్తి బాస్కర్‌రెడ్డి, మేకలకుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ, కుడుముల గోపాల్, దాసరి శైలజా, పసల వెంకటేశ్లర్లు, పిచ్చిరాజు, చిట్టేటి శ్రీనివాసులు, పారిచర్ల రాగవులు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటిన్

వెంకటగిరి ఆగస్టు 1 ప్రభాతవార్త

మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ ఏర్పాటు చేసిన అన్న క్యా ంటిన్ పేదలకు ఆకలి తీర్చేందుకే ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు తెలిపారు. సోమవారం అన్న క్యాంటిన్‌ను పరిశీలించి అన్నం వడ్డించారు. ఆయన మాట్టాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి అన్న క్యాంటిన్లను ఎత్తివేసి పేదల కడుపు కొట్టినట్లు తెలిపారు. పేదలు ఆకలితో ఇబ్బంది పడుతుంటే మాజి ఎంఎల్‌ఎరామకృష్ణ మస్సు చలించి వారికోసం సొంత డబ్బులతో క్యాంటిన్‌నే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాదర్, శ్రీపివాసులు తదితరులు ఉన్నారు

## నేలపట్టులో పారిశుధ్య పనులు

దొరవారిసత్రం, ఆగస్టు 1 ప్రభాతవార్త

దొరవారిసత్రం నేలపట్టు గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులను వైద్యాధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దేదీప్య గ్రామంలో ఉన్న నీటి ట్యాంకులు, నేలబావులు తదితర గుంటల్లో నుంచి నీళ్లు వినియోగిస్తున్న వాటికి క్లోరినేషన్ చేశారు. అనంతరం ప్రతి ఇంట్లో ఉన్న నీటి ఓవర్‌హెడ్ ట్యాంకులకు వారానికి రెండుసార్లు శుభ్రం చేసుకోవాలని వైద్యాధికారి తెలిపారు. వీరితో పాటు ఎంపీహెచ్ విజయకుమార్, వెంకటయ్య, పంచాయతీకార్యదర్శి ప్రవీణ్‌రాయ్, సర్పంచ్ రామయ్య తదితరులు ఉన్నారు.

## ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం వారికి, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం వారికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరని చెప్పారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు 320 మంది, సీనియర్ విద్యార్థులు 300 మంది ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

## చెరువు పనులు పరిశీలన

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త

కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో అమృత సరోవర్ కింద చెరువు పనులు జరుగుతున్నాయి. ఆ పనులను సోమవారం ఏపీవో గోపి పరిశీలించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమాల్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అమృత సరోవర్ పేరుతో చెరువుల్ని బాగు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఆ మేరకు రూ.9 లక్షల వ్యయంతో ఊనుగుంటపాలెం చెరువును అభివృద్ధి చేస్తున్నారు. ఆగస్టు 15న చెరువు కట్టలపై జెండా ఎగురవేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో విజయమ్మ తెలిపారు.

## సామాజిక పింఛన్లు 93 శాతం పంపిణీ

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త

మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా సోమవారం తెల్లవారుజామున వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ 93 శాతం పూర్తయినట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం పాతవి 6733 కాగా, కొత్తవి 388 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

## నాయుడుపేటలో కొత్త పింఛన్లు పంపిణీ

నాయుడుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త

ఆగస్టు నెలలో కొత్తగా మంజూరైన పింఛన్లను నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కటకం దీపిక లబ్దిదారులకు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస రావు, వైసీపీనాయకులు కటకం జయరామయ్య, కోఆప్షన్ మెంబర్లు కుమార్, వార్డు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు షేక్ రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వార్డుకౌన్సిలర్లుసాధు శాంతి, షేక్ షబ్బీర్, కరింభాయ్ చెంచయ్య, మల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

## నవరత్నాలతో ప్రజలకు లబ్ధి

సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త

నవరత్నాలలో భాగంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరుస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోనియాగాంధీ నగర్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నవరత్నాల కార్యక్రమాలలో భాగంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయా అని ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, జెట్టి వేణు, వైస్ ఛైర్‌పర్సన్ పోలూరు పద్మ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, పముజుల విజయలక్ష్మి, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

## ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ ప్రారంభం

- సూళ్లూరుపేట ఆర్డీవో రోజ్‌మాండ్

సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఓటర్లకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించినట్లు సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్.రోజ్‌మాండ్ వెల్లడించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్లలో తప్పొప్పులను సరిదిద్దుకోవడంతో పాటు నియోజకవర్గ మార్పిడి వంటి విషయాలపై సంబంధిత ఫారంలను పూర్తి చేసి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నవంబరు 9న ప్రకటించడం జరుగుతుందని, దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ నవంబరు 9 నుంచి డిసెంబర్ 8వరకు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవికుమార్, వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## తడ మండలంలో కొత్త పింఛన్ల పంపిణీ

తడ, ఆగస్టు 1 ప్రభాతవార్త

ఆగస్టు నుంచి కొత్తగా లబ్దిదారులను ఎంపిక చేసి పింఛన్లను పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉదయం నుంచే కోలాహలంగా పింఛన్‌దారులు సచివాలయాలకు క్యూకట్టారు. ఆయా చోట్ల వాలంటీర్లు కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు పింఛన్లు పంచిపెట్టారు. తడకండ్రిగ పంచాయతీలో 34 మంది లబ్ధిదారులకు నూతనంగా పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కె.రఘురెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్, సెక్రటరీ రమణయ్య, సర్పంచ్ తుమ్మా జయప్రద, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తడ, ఆగస్టు 1 ప్రభాతవార్త

తడలో గత నెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వి.జయకుమార్ (24) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. తడలో జాతీయ రహదారిపై తన ట్రాక్టర్‌కు పైన టాప్ కుట్టించుకొని వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్‌కు వేయాల్సిన టాప్‌ను బైక్‌కు కట్టుకొని వెళుతుంటే గాలి ఒత్తిడికి అదుపుతప్పి పడిపోవడంతో ఇతను గాయపడ్డాడు. తమిళనాడులోని గుమ్మిడిపూండి తాలూకా పాంచాలై అనే గ్రామానికి చెందిన జయకుమార్ చెన్నైలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వ్యవసాయదారుడైన తన అన్న కొడుకు ఈ విధంగా మృతిచెందడంతో ఆ కుటుంబం వీధిన పడిందని మృతుడి చిన్నాన్న కన్నన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల జాబితా అంశాలపై ఆర్డీఓ సమీక్ష

గూడూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓటరు నమోదు తదితర అంశాలపై రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో ఆర్డీఓ మురళీకృష్ణ సోమవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు నమోదు, తొలగింపు, ఓటుహక్కు వినియోగానికి ఆధార్ అనుసంధానం వంటి విషయాలపై చర్చించామన్నారు. ప్రస్తుతం 17సంవత్సరాలు నిండిన వారంతా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో గూడూరు డివిజలోని తహశీల్దార్‌లు, తెలుగుదేశంపార్టీ, బిజెపి, కాంగ్రెస్, బిఎస్పీ, సిపిఐ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాది పనుల్లో జారిపడి మహిళకు గాయాలు

బాలాయపల్లి ఆగస్టు 1 ప్రభాతవార్త

మండలంలోని అలిమిలి గ్రామానికి చెందిన ధనమ్మ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీపథకం పనులకు వెళ్ళి జారిపడి గాయపడింది. జారిపడడంతో చేయి విరిగింది. బాలాయపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం చేర్చగా చేయి విరడంతో ఆమెను నెల్లూరుకు తరలించారు.

## ఎన్‌టిఆర్ కుమార్తె మృతికి సంతాపం తెలిపిన మాజీ ఎంఎల్ఎ

వెంకటగిరి ఆగస్టు 1 ప్రభాతవార్త

దివంగత మాజీ సిఎం ఎన్‌టిరామరావు కుమార్తె కంటమనేని ఉమామహేశ్వరి మృతికి మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్‌బీరం రాజేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జండా ఎగరాలి

వెంకటగిరి ఆగస్టు 1 ప్రభాతవార్త

ఆగస్టు నెల 15న ప్రతి ఇ ంటిపై జాతీయ జండాను ఎగరవేయాలని ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రల ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ తెలిపారు. సోమవారం కన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఆజాదికా అమృతోత్సవం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఖండ కార్యావాహక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం :సిడిపిఓ

వెంకటగిరిరూరల్ ఆగస్టు1ప్రభాతవార్త:

పుట్టిన బిడ్డకు తల్లి పాలు అమృతంతో సమానమని, అదేవిధంగా ముర్రు పాలులో అనేక ఔషధ గుణాలున్నాయని వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సిడిపిఓ షంసాద్‌బేగం అన్నారు. సోమవారం ప్రపంత తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా వెంకటగిరి అంగన్‌వాడి ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలల్లో తల్లి పాలు వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేది వరకు ఘనంగా నిర్వహించాలని సూచించారు. సిడిపిఓ మాట్లడుతూ వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాలు సంస్కృతి ప్రోత్సహంపై దృష్టి పెడదాం అని అదేవిదంగా ప్రసవించిన అరగంట లోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని తెలిపారు. అదేవిదంగా తల్లిపాలు సర్వ రోగనివారిణి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రొంపిచెర్లలో తల్లిపాల వారోత్సవాలు

రొంపిచెర్ల ఆగస్టు1 ప్రభాతవార్త

మండల పరిధిలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమం ఈనెల 7వరకు ఉంటుందని ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలు కల్తీలేనివని తల్లి పాలు అమృతంతో సమానమని తల్లిపాలు సురక్షితమైనవని సులభంగ జీర్ణం అవుతాయని వివరించారు. అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటాయని, అంటువ్యాధులు రాకుండా రక్షిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, పూజిత, గాయత్రి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 255 కొత్త పెన్షన్లు పంపిణీ

యర్రావారిపాలెం, ఆగస్టు1ప్రభాతవార్త

మండల పరిదిలో కొత్తగా మంజూరైనా వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగలా నిర్వహించారు. మొత్తం 255 కొత్త పింఛన్లు మంజూరు కాగా వారికి అందరికి పింఛన్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీపీ శివలక్ష్మి, వైకాపా మండల కన్వీనర్ నాగార్జునరెడ్డిలు పాల్గొన్నారు. అదేవిదంగా నెరబైలు, ఉదయమాణిక్యం సచివాలయాల్లో సర్పంచి దేవేంద్ర, లక్ష్మణరెడ్డి, లు పంపిణీ చేయగా వైకాపా నాయకులు హరినాధరెడ్డి, సన్నీ , బాలాజీ, చంద్రశేఖరరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజలకు సాయం

సదుం, ఆగస్టు 1 ప్రభాతవార్త

రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రజలకు సాయం చేస్తోందని ఇందులో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పెట్టిందని ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలలోని మొరవపల్లె గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అందుకున్నారు. వినతులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఏపీఓ శివశంకర్, ఏపీఎం హరిప్రసాద్, ఎంపీడీఓ ఆదిశేషారెడ్డి, ఏఓ మాధవి, ఈఓఆర్డీ వరప్రసాద్, ఏఈఓలు వినోద్, కృషా ్ణరెడ్డి, జయచంద్రారెడ్డి, అరుల్‌దాస్, సీసీ మదు, రమేష్, సర్పంచి జగన్నాధం, ఎంపీటీసీ మల్లికార్జున, లైన్‌మెన్‌లుబాబు, మల్లయ్య, వైకాపానాయకులువెంకటరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, వాసు, శివానందరెడ్డి, పుత్రాజు, యల్లారెడ్డి, కిరణ్‌కుమార్, హరిప్రసాద్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

కేవీబీపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:
మరలా మనకు మంచి చేసే సీఎం కావాలంటే మరలా మనమందరం జగన్మోహన్‌రెడ్డిని కోరుకోవాలని అందుకు మనమంతా రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని ఉదయం ఓలూరుపాళెం పంచాయతీ పాతపాళెం పంచాయతీలో గడపగడపకు ప్రోగ్రామం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగింది. ఓలూరుపాళెం గ్రామ పంచాయతీ కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా అనేక పథకాలను ఆయన ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో మరో లేని విధంగా నిలిచిపోయారన్నారు. రాష్ట్ర హిస్టరీ అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోసుమారు రూ.7 కోట్ల 68 లక్షల

రూపాయలు 782 మంది లబ్ధిదారులకు అందిందని, సంక్షేమ పథకాలు అందించి ఉందంటే జగన్మోహన్‌రెడ్డికి మనం కృతజ్ఞతలుగా ఉండాలని ఆయన కోరారు. గ్రామ ఎంపీటీసీ గోనె రామ్మోహన నాయుడు మాట్లాడుతూ రాయల చెరువు కొలను తూములను చేసి మూడఉ కోట్లు పంపామని ఇంత వరకు అది గుర్తు లేదని ఇరిగేషన్ శాఖ డిపార్ట్‌మెంట్ వారికి తెలియజేసి మరమ్మతులు చేపట్టాలని సభలో ఎంపీటీసీ మోహన్‌నాయుడు కోరారు. అనంతరం కొత్తగా వచ్చే రేషన్‌కార్డులు, పింఛన్‌లను వికలాంగుల పింఛన్లను ఎంపీడీవో ఆనంద్‌రావు ఎమ్మెల్యేచే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మునిలక్ష్మి నందకుమార్, హిస్టరీ అకాడమి డైరెక్టర్ జి.కృష్ణయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తెరణి ధనంజ యరెడ్డి, మహిళా సంఘం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వసంతాలు బాబు యాదవ్, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, వి.సరస్వ తి, సత్య వేదుని యోజకవర్గంమహిళాఅధ్యక్షురాలుబుర్రమాధవిరెడ్డి, కొల్లూరు పాళెం ఎంపీటీసీ గోనెరి మోహన్‌నాయుడు, పర్వతాల బాల సుబ్రహ్మ ణ్యం, బీసీసంఘం అధ్యక్షుడు అగ్రహారం హరిబా బురెడ్డి, రాయ పేడు హరి బాబు, ప్రవీణ్‌రాజు, ప్రవీణ్, సర్పంచ్‌లు, వైసీపీ నాయ కులు, ఎంపీటీసీలు, ఎంపీడీవోఆనంద్‌రావు, లక్ష్మీపతినాయుడు, ఏపీఎం రమా దేవి, ఐసీడీఎస్‌సూపర్‌వైజర్‌హైమావతి, అగ్రికల్చర్‌ఆఫీసర్‌శాంతి, జడ్పీటీసీ అ ధ్యక్షుడుమూర్తి మునెమ్మ, సుబ్బయ్య, సర్పంచ్‌లసంఘం అధ్యక్షుడు జి.రామ్మోహన్‌రావువర్మ, మాజీజడ్పీటీసీబందెలడేవిడ్, వీఆర్‌వోలుపం చాయతీకార్యదర్శుమండలస్థాయిఅధికారులు, అంగన్‌వాడీపాల్గొన్నా రు

# తిరుపతి డివిజన్

## మెకానికల్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మునిరెడ్డి నియామకం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త :



రాష్ట్రనవ్యాంధ్ర టూవీలర్స్ మెకానికల్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా తిరుపతికి చెందిన ఆవుల మునిరెడ్డి, రాయలసీమ పరిధిలోని ఐదు జిల్లాల ఇన్‌చార్జిగా ఎన్ఆర్ భాష, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడిగా మల్లీశ్వరన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుభాని నుంచి ఉత్తర్వులు అందాయని ఆవుల మునిరెడ్డి తెలిపారు. తిరుపతి టూవీలర్ మెకానికల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఆవుల మునిరెడ్డి మెకానికల్‌కు చేస్తున్న సంక్షేమం, సేవ కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర కమిటీలో చోటు లభించడంపై తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ హర్షం వ్యక్తం చేశారు.

## ఆదిఆంధ్రవాడలో రవియాదవ్‌కు సన్మానం

కార్వేటినగరం, ఆగస్టు 1 ప్రభాతవార్త:
కార్వేటినగరం పంచాయితీ పరిధిలోని తూర్పు ఆరుంధతివాడలో జిడినెల్లూరు బిసిసెల్ నాయకుడు రవియాదవ్‌కు ఘనసన్మానం జరిగింది. ఆరుంధతివాడలో మాతమ్మతిరునాళ్ళకు రవియాదవ్ గ్రామ మండడిగా వ్యవహించేవారు. గ్రామస్థులు సన్మానం చేసి ఊరేగింపుగా ఇంటికి తీసుకువచ్చారు.

## తాతాసొరకాయులస్వామి మహా గురుపూజోత్సవాలకు ధ్వజారోహణం

నారాయణవనం, ఆగస్టు 1 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో అవదూతగా భక్తుల మన్ననలను పొందుతున్న తాతాసొరకాయులస్వామి 120వ మహాగురుపూ జోత్సవానికి సంబందించి సోమవారం ఉదయం ఘనంగా ధ్వజారోహణం నిర్వహించారు. మంగళవారం మహాగురుపూజ, కలశపూజ, రాత్రి ఊరేగింపు వుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మంగళవారం మహాగురుపూజోత్స వం జరుగుతుంది.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్త ఫించన్లు పంపిణీ కార్యక్రమం

నారాయణవనం, ఆగస్టు 1 ప్రభాతవార్త :

నారాయణవనం మండలంలో వృద్దులకు, వితంతవులకు కొత్తగా మంజూరైనా ఫించన్లను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. మండలకేంద్రంలోని నారాయణవనం సచివాలయం-2లో జరి గిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫించన్లతో ఎంతో మంది వృద్దులు, వితంతవులు లబ్దిపొందుతున్నట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్సి యల్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, ఎంపిడిఓ గంగా భవాని, తహశీల్దారు ప్రమీల, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, ఇఓ వి ప్రభురావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్‌బియ్యం పంపిణీలో అవకతవకలు

కార్వేటినగరం, ఆగస్టు 1 ప్రభాతవార్త:
తెలుగుదేశంపార్టీ జాతీయఅధ్యక్షులు చంద్రబాబునాయుడు, జిడినెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి భీమినేని చిట్టిబాబు ఆదేశాల మేరకు రేషన్‌బియ్యం పంపిణీలో మోసం, రేషన్‌కార్డులు తొలగింపు, నాణ్యతలేని వస్తువులు పంపిణీ, రేషన్‌కోటాలోకోత, రేషన్‌షాపులో ఇచ్చే కందిపప్పు, పంచదార ధరలపెంపు, ఒషన్‌బి య్యం అక్రమరవాణా, ఉచితబియ్యాన్ని అందరికి పంపిణీచేయాలని డిమాండుచేస్తూ కార్వేటినగరం మండలం టిడిపికమిటి ఆధ్వర్యంలో తాహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు చెంగల్‌రాయల్‌యాదవ్, ప్రధానకార్యదర్శి రాజేంద్రరెడ్డి, వాసుదేవరెడ్డి, రవియాదవ్, బీగాల రమేష్, దామోదరం, నేత ఈశ్వర్, సయ్యద్‌పర్వేజ్, దస్తగిరి, నియాజ్, సోము, మాజీఎంపిపి రవికుమార్, మురళి, లక్ష్మణ్‌రాజు, జగన్నాధం, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో అవాంఛనీయ సంఘటనలకు దూరం

పుత్తూరురూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:
గొల్లపల్లిలో 36 ఏళ్ళ తరువాత నిర్వహించనున్న గ్రామదేవత పోలాక్షమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్థులు సహకారం అందించాలని ఎస్ఐ గౌరిశంకర్ సూచించారు. సోమవారం రాత్రి ఆయన సిబ్బందితో కలసి గొల్లపల్లిలో పర్యటించారు. సర్పంచ్ విరిత ఆధ్వర్యంలో గ్రామస్థులతో చర్చించారు. ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల సందర్భంగా అవసరం మేరకు పోలీసు బందోబస్తు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీసులు జగన్నాథం, మాధవ, సాంబశివ, వైసీపీ నాయకులు దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కామాక్షిదేవికి పాలాభిషేకం

పుత్తూరురూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివుని ఆలయంలో సోమవారం అమ్మవారి జన్మనక్షత్రం(పుబ్బ నక్షత్రం) సందర్భంగా అమ్మవారికి పాలాభిషేకం ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. అనంతరం అమ్మవారిని గాజులతో తయారు చేసిన మాలను అమ్మవారికి అలంకరించారు. అలాగే సదాశివుని కూడా ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత సియం జగన్‌దే

-తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:

రేషన్ షాపు డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిదే అని తెలుగుదేశం పార్టీ తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఏ.ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం తిరుపతిరూరల్ తహశీల్ధార్ కార్యాలయం ముందు మోకాళ్లతో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆహార భద్రత కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, నిత్యావసర ధరల నియంత్రణలో కూడా నిఘా కొరవడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు వేమూరు మధు, ఉసిరిపాటి శ్రీనివాసులు, నాగూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, మోహన్‌రెడ్డి, కళావతి, ముంతాజ్, బిరుదాల భాస్కర్‌రెడ్డి, మునిశేఖర్, గోఫి, ఈశ్వరయ్య, విప్పర్ల లోకేష్‌నాయుడు, మధుశేఖర్, ధనంజయ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలి!

-కలెక్టరేట్ ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 1 ప్రభాతవార్త:

ఇప్పటి వరకు స్వచ్ఛ భారత్ కార్మికులకు రావాల్సిన పెండింగ్ జీతాలు తక్షణం ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, స్వచ్ఛ భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.శివకుమార్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ కార్యదర్శి చంద్రబాబు, స్వచ్ఛ భారత్ వర్కర్‌స యూనియన్ జిల్లా కన్వీనర్ అన్నాదొరై, ముని, కళావతి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పతాకంను ఆవిష్కరించిన సెట్విన్ సీఈవో

తిరుపతి (క్రీడ), ఆగస్టు 1 ప్రభాతవార్త:

ఆజాదీక అమృత్ మహోత్సవ్ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా సెట్విన్ సీఈవో మురళీకృష్ణ జాతీయ పతాకంను శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జెన్ అకాడమి కార్యదర్శి కిరణ్ కుమార్, స్కేటింగ్ కోచ్ ప్రేమ్‌నాథ్, హాకీ కోచ్ శ్రీ లక్ష్మీ కరుణ, ఇందుజ, జుమనారాణి, వినోద్, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు త్రివర్ణ పతాకం గొప్పదనం గురించి వివరించారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు ఈనెల 13వ తేది నుంచి 15వ తేది వరకు ప్రతి ఇంటి మీద జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.

## ఎస్పీ సుప్రజను అభినందించిన రాజేష్ - భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి (క్రీడ), ఆగస్టు 1 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా ఏఎస్పీగా పనిచేస్తూ ఎస్పీగా పదోన్నతి పొందిన సుప్రజను జీడీ నెల్లూరు వైఎస్సార్ సీపీ నాయకులు , జెన్ అకాడమి అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భానుప్రకాష్ రెడ్డిలు కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ హోదాలో ప్రజలకు ఎస్పీ సుప్రజ చేసిన సేవలను కొనియాడారు. ఏఎస్పీగా ఎన్నో కేసులను ఛేదించారని, ముఖ్యంగా మహిళల్లో మనో ధైర్యాన్ని నింపారని కొనియాడారు. అలాగే ప్రజా సేవలో ఎస్పీగా పదోన్నతి పొందిన ఏఎస్పీ సుప్రజ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని భానుప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేసిన గుండాల గోపీనాథ్

తిరుపతి (విద్య), ఆగస్టు 1 ప్రభాతవార్త:
మధుర గాయకులు ఘంట సాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేది ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రముఖ గాయకులు సురేష్ స్వామిని ఘనంగా సన్మానించారు. ఈకార్య క్రమంలో ఘంట సాల అభిమానులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడినడ, సురేష్ స్వామి, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడినడ, జైజై రెడ్డి, సందీప్ నాయుడు, రాజశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## రేషన్ సరుకుల పంపిణీ తీరుపై టిడిపి ర్యాలీ

చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త:
నియోజకవర్గంలో రేషన్ సరుకుల పంపిణీ తీరుపై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం వద్ద టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగపల్లి భాస్కర్ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు రేషన్ బియ్యం పంపిణీలో మోసం, నాశిరకం వస్తువుల పంపిణీ, రేషన్ కోటాలో కోత విధించడం, కంది పప్పు, పంచధార ధరల పెంపు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడంతో పాటు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, రాకేష్ చౌదరి, అమ్ములు నాగరాజ, తులసి రెడ్డి, కన్నయ్య నాయుడు, రూప్‌సుందర్ రెడ్డి, భూలక్ష్మి, సురేష్, నాయుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్న ప్రభుత్వం

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:
పేదల నిత్యవసర సరుకులు పంపిణీ చేసే ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం అస్తవ్యస్తం చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి దుయ్యబట్టారు. రేషన్ సరుకుల పంపిణీ అవకతవకలపై సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మునిశైలజకు టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, రావిళ్ళ గిరి, పసుపులేటి విజయ్‌కుమార్, కోటీశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త:
మండల పరిధిలోని రెండు వేర్వేరు ప్రదేశాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న శానంబట్లకు చెందిన ఉమాపతిరెడ్డిని వెనుక నుండి ప్రైవేటు స్కూల్ వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై విషమ పరిస్థితుల్లో వైద్య చికిత్సలు పొందుతున్నాడు. అదేవిధంగా ఏ.రంగంపేట నుండి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులు శ్రీనివాసమంగాపురం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురి కాగా అంజి, గణేష్ కళ్ళు విరిగాయి. కాగా గంగుడుపల్లి ఓ లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు.

## అర్హులందరికి పింఛన్లు పంపిణీ

-కుంట్రపాకం గ్రామ సర్పంచ్ శుభపద్మనాభరెడ్డి

తిరుపతిరూరల్, ఆగష్టు01 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికి పెన్సన్ అందిస్తుందని కుంట్రపాకం గ్రామ సర్పంచ్ రాచపాళ్యం శుభ పద్మనాభరెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామ పంచాయతీలో కొత్తగా మంజూరైన పెన్షన్లు అందజేసారు. సర్పంచ్ శుభ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్హులందరికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లిలో కొత్త పెన్షన్లు పంపిణీ

తిరుపతిరూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్ళపల్లిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను సోమవారం లబ్దిదారులకు పంపిణీ చేసారు. గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వయో వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్సన్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నేత కొత్తపాటి మునీశ్వరరెడ్డి, పెన్సన్ లబ్దిదారులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ ఆస్పత్రి సేవలు అమోఘం - శివప్రసాద్

రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త:

శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సేవలు చాలా అద్భుతంగా ఉన్నాయని రేణిగుంట తహసీ ల్దార్ శివప్రసాద్ కితాబిచ్చారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని శ్రీబాలాజీ ఆసుపత్రి నందు ఐసీయూనిట్‌ను తహశీల్దారు ప్రారంభించారు. 61 ఇన్సెంటివ్ కేర్ బెడ్లు, నవ శిశువుల కోసం ఇంక్యుబేటర్లు, వెంటిలేటర్లతో సేవలందించడానికి ఆస్పత్రి సిద్ధమైంది. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో బాలారిష్టాలను, ఒడిదుడుకులను ఎదుర్కొని ఆస్పత్రి నిర్మాణం పూర్తయిందన్నారు. రోగులకు నామమాత్రపు రుసుములు, కొంత మందికి ఉచితంగా వైద్య సేవలు అందించడం హర్షనీయమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరస్వామి, కళాశాల ప్రిన్సి పాల్ సుధాకర్‌రెడ్డి, జేఈవో డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ ఆస్పత్రిని సేవా దృక్పథంతో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆయా విభాగాలకు ప్రత్యేక వైద్యనిపుణులున్నారన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు వైద్యం, మందులు, శస్త్ర చికిత్సలు ఉచితమని తెలిపారు. అందు కోసం ప్రతి ఒక్కరు రిఫరల్ కార్డు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుందన్నారు. 350 బెడ్లతో ఆస్పత్రి సేవలందిస్తుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్యులు సౌమ్య, సాహో, రాజేష్‌నాయుడు, ప్రకాష్, కీర్తిప్రశాంతి, సౌమ్య, ప్రశాంతి, సురేంద్రరెడ్డి, సాయిరాం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మా కుటుంబం ప్రజాసేవకే అంకితం - పవిత్రారెడ్డి

రేణిగుంట, ఆగస్టు 1 ప్రభాతవార్త:

తమ కుటుంబ సభ్యులంతా ప్రజాసేవకే అంకితమయ్యామని రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణంలో 16 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు డ్రైన్‌కు సోమవారం పవిత్రరెడ్డి భూమిపూజ, సచివాలయం-1లో కొత్తగా పింఛను మంజూరైన వారికి పింఛనున అందచేశారు. ఆమె మాట్లాడుతూ రేణిగుంట పంచాయతీని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి చొరవతో లబ్ధిదారులందరికీ పించన్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీపీ హరిప్రసాద్, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట సర్పంచ్ నాగేషం, వైస్ సర్పంచ్ ఇర్ఫాన్, పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ ఫైజునిస్సా షబ్బీర్ కో-ఆప్షన్‌మెంబరు సుభాన్‌రాజా, పలువురు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## రేషన్‌పై తహశీల్దార్‌కు తెదేపా వినతిపత్రం

తొట్టంబేడు, ఆగష్టు 1 ప్రభాతవార్త

చౌకదుకాణాల్లో జరుగుతున్న అవకతవకలతో పాటు బియ్యం అక్రమరవాణా, ప్రభుత్వం ఇస్తున్నటువంటి బియ్యం, కందిపప్పు మరియు చక్కెర, పామాయిల్ తదితర నిత్యావసర వస్తువులపై ధరలు పెంచుకుంటూ సామాన్యులపై భారం మోపడం, అంతేకాకుండా రేషన్‌కారునడలు తొలగించడం ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసం అన్నారు. నాణ్యమైన సరుకులు అందిస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా డీలర్లను తొలగించడం వారికి ఇవ్వాల్సిన కమిషన్లు కూడా ఇవ్వకపోవడం జగన్‌కే దక్కిందన్నారు. రేషన్‌డీలర్లను తొలగిస్తే సహించేది లేదని తహశీల్దార్ సుధీర్‌కు వినతిపత్రం అందించారు.

## మాధవమాల దళితరైతులకు న్యాయం చేయాలి..సిపిఐ

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త
ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామంలో భూములు కోల్పోయిన దళితరైతులకు నష్టపరిహారం చెల్లించాలని శ్రీకాళహస్తి సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాలగురవయ్య అన్నారు. సోమవారం ఏర్పేడు మండల కార్యదర్శి ఆర్ఎస్‌కెమూర్తి ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా గురవయ్య మాట్లాడుతూ 2016లో ప్రభుత్వం భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా జాప్యం చేయడం మంచిదికాదని అలాగే భూములు కోల్పోయిన వారికి ఇంటికి ఒక ఉద్యోగం 0.03సెంట్లు ఇంటిస్థలం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, రమేష్, మల్లికార్జున, కుమార్, రైతులు వెంకటయ్య, తిరుపాలయ్య, గున్నయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

తొట్టంబేడు, ఆగస్టు 1 ప్రభాతవార్త

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తొట్టంబేడు ప్రాథమిక వైద్యాదికారి డాక్టర్ పద్మజ అన్నారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశాల మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరపాలని ఇచ్చిన ఆదేశాల మేరకు తొట్టంబేడు మరియు కళ్ళిపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాదికారిణి డాక్టర్ పద్మజ, మరియు హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి తల్లి కాన్పు అయిన అరగంటలో ముర్రుపాలు త్రాగించినట్లయితే బిడ్డకు సహజవ్యాధి నిరోధక శక్తి కలిగి జీవితంలో వ్యాధలు రాకుండా ఉండడమే కాకుండా రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. శిశుమరణాలు జరగడానికి కారణమయ్యే శ్వాసకోసవ్యాధులు, కామెర్లు, డయేరియా వంటి రోగాలను ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తి తల్లి పాలలోనే నవజాత శిశువుకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాదికారులు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్పీలు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం భారతీ, డిల్లీరాణి, హెల్త్‌అసిస్టెంట్ తులసీనాధ్, ఆశాకార్యకర్తలు భారతీ, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 4న కాంగ్రెస్‌పార్టీ సమావేశం

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త
ఈనెల 4వ తేదీన ఊరందూరులోని రైస్‌మిల్లు ప్రాంగణంలో 4వ తేదీన నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జంగాలపల్లి.అన్నపూర్ణమ్మ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు, మైనార్టీలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. 2024ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నిరుపేదలకు భోజనప్యాకెట్లు పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త

పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న సత్యసాయి బాబా మందిరం ఓం శ్రీసత్యసాయి అన్నప్రసాద మరియు ఛారిటబుల్ ట్రస్టు సారధ్యంలో పట్టణంలోని 55మంది నిరుపేదలకు భోజన ప్యాకెట్లను అందించినట్లు మేనేజింగ్ ట్రస్టీ ఎల్.పాండురంగయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి అన్నప్రసాద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంతేకాకుండా ప్రతిరోజు నిరుపేదలకు అన్నదానం చేస్తున్నా మన్నారు. ప్రభాకర్‌నాయుడు, దొంతుసాయి, అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణ వీరభద్రుని వార్షిక బ్రహ్మోవాలకు అంకురార్పణ

నారాయణవనం, ఆగస్టు 1 ప్రభాతవార్త :
మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ పరిధి (చిత్రాంగికోట) సముదాయం గ్రామానికి వెళ్లే మార్గంలోని వీధిలో వెలసిన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు 2 నుండి 10వతేది వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆగస్టు 2తేది మంగళవారం ఉదయం అంకురార్పణ, సాయంత్రం 6.30నుంచి 7.30 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుంది.

## అర్హులకు పించన్లు పంపిణీ

అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి

చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త:
అగరాల గ్రామ పంచాతీలో అర్హులైన వారికి సోమవారం నుండి నూతన పించన్లు మంజూరు చేయడం జరిగిందని అగరాల సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి అన్నారు. పంచాయతీ నూతనంగా మంజూరైన పించన్లను ఆయన లబ్దిదారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో సాధారణ పించన్లతో పాటు డప్పు కళాకారులకు సైతం ం పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రాజశేఖర్, సచివాలయ కార్యదర్శి ఎస్.పాహిమా, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం లక్ష్మి, వాలంటీర్లు మునిరాజ, షరీఫ్, సోము, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో అతిధులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం అతిధుల తాకిడి చోటుచేసుకుంది. ఈనేపద్యంలో విజయనగరం ఎంఎల్సి రఘురాజు, పశ్చిమగోదావరి ఎంఎల్సి మంతెన వెంకట సత్యనారాయణ, మరియు వైఎస్ఆర్‌సిపి ట్రేడ్ యూనియర్ తిరుపతి జిల్లా అధ్యక్షులు బీరేంద్ర వర్మలు కుటుంబసమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఆలయ దక్షిణగోపురం వద్ద వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు.

## గల్లా అరుణకుమారికి ఘన సన్మానం

టిడిపి గల్లా యువసేన జన్మదిన శుభాకాంక్షలు

చంద్రగిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త:

మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షురాలు గల్లా అరుణకుమారి పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయరెడ్డిపుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ అలంకరించి ఘనంగా సన్మానించారు. టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నానితో కలసి ఆయన గల్లా అరుణకుమారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం చంద్రగిరి టిడిపి కార్యాలయంలో సక్కుర్ ధనంజయ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్‌చేసి అరుణమ్మ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

సదుం, ఆగస్టు1 ప్రభాతవార్త

మండల పరిదిలోని పలు సచివాలయాలలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చెరకువారిపల్లె, నడిగడ్డ, సదుం సచివాలయాలలో ఈమేరకు తల్లిపాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా నడిగడ్డలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన నిర్వహించారు. డాక్టర్ చరణ్ మాట్లాడుతూ ప్రతి తల్లి కాన్పు అయిన వెంటనే బిడ్డకు ముర్రు పాలు తాగించాలన్నారు. దీనివల్ల వ్యాది నిరోధక శక్తి పెంపొంది ఎటువంటి అంటు వ్యాధులు రాకుండా ఉండేందుకు వీలవుతుందన్నారు. సర్పంచి నారాయణరెడ్డి, విలేజ్ హెల్త్ శానిటేషన్ కమిటీ ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది నీలకంఠ, భాగ్యలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది సుజాత, రషీద, ఆశా కార్యకర్తలు పార్వతమ్మ, శ్యామల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లూరులో తల్లిపాల వారోత్సవాలు

కల్లూరు, ఆగస్టు1ప్రభాతవార్త



తల్లిపాలు బిడ్డకు శ్రేష్టకరమని వైద్యాదికారిణి జానకిరావు, ఐసీడీయస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందిశారద, రెడ్డెప్ప, అంజలిదేవి, రోహిణి, మొహర, అంగన్‌వాడీ కార్యకర్తలు అమృతకుమారి, పార్వతి, ఆశాకార్యకర్తలు జీవని, మీనా, విజయలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

## నేడు నూతన పెన్షన్ల పంపిణీ

కుప్పం, ఆగస్టు1 ప్రభాతవార్త
వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా కుప్పం మున్సిపాలిటీలో నూతనంగా మంజూరైన 297 పింఛన్లను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో లబ్దిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందని కమీషనర్ రవిరెడ్డి తెలిపారు.

# ప్రజల హృదయం నిండా మువ్వెన్నల జెండా

గూడూరు,ఆగస్టు 1 ప్రభాతవార్త : ప్రజల హృదయం నిండా మువ్వెన్నల జెండా ఉంటుందని అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ప్రతి పౌరుడు జనగణమణ పాడాలని గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి,మున్సిపల్ కమీషనర్ సాయినాథ్‌లు పిలుపునిచ్చారు.గూడూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు కావస్తున్న సంధర్భంగా దేశవ్యాప్తంగా ఆజాదికి అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.75వారాల పాటు జరగనున్న మహోత్స వాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు.ప్రతి ఒక్కరూ జాతీయగీతం పాడి రాష్ట్ర గీత్ వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆయన సూచించారు. 2047నాటికి దేశం ఏస్థాయికి చేరాలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని సూచించారు.ఆజాదీకి అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ప్రతి పౌరుడు జనగణమణ పాడాలని కేంద్రం ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు తెలిపారు. దాదాపు రెండు వందల ఏళ్లపాటు దేశాన్ని పాలలించిన బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమమే జాతీయోధ్యమమని స్వాతంత్ర్యోద్యమం. భారతజాతి దాస్యశృంఖలాల నుంచి విముక్తి కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం తృణపాయంగా త్యాగం చేసిన ఫలితమే 1947లో దేశానికి స్వరాజ్యం సిద్ధించిందన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి,పోలీసుసిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: జిల్లా పోలీసు పేరెడ్ గ్రౌండ్స్‌లో ఆగస్టు 15న 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జెసి సమావేశ ఛాంబర్‌లో సోమవారం జెసి వెంకటేశ్వర్ డిఆర్ఓ రాజశేఖర్, ఎఎస్పీ జగదీష్‌లతో కలిసి 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణను జిల్లా అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి విజయవంతం చేయాలన్నారు. పోలీసు పెరేడ్ గ్రౌండులో ప్రోటోకాల్ ప్రకారం కోవిడ్ నిబంధనల మేరకు సిటింగ్ ఏర్పాట్లు, ఆహ్వాన పత్రికల పంపిణీ, పెరేడ్ గ్రౌండులో ఇతర ఏర్పాట్లను చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక పర్యవేక్షణలో తహసిల్దారు పార్వతి చేయాలన్నారు. అలాగే వివిధ శాఖల ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాట్లు, విద్య, వైద్య, గృహ నిర్మాణ, వ్యవసాయ అనుబంధ శాఖల శకటాల ప్రదర్శన చేపట్టాలని సూచించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రగతిపై జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి జిల్లా ప్రజలకు సందేశం ఇస్తారని ఈ ప్రగతి నివేదిక క్లుప్తంగా వుండేలా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, డ్వామా పిడి చంద్రశేఖర్, హౌసింగ్ పిడి పద్మనాభం, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, హార్టికల్చర్ డిడి మధుసూధన్‌రెడ్డి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ భాషా, కలెక్టరేట్ ఎఇ కులశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై విచారణ

కోట, ఆగస్టు 1 ప్రభాతవార్త : మండలంలోని ఓ ప్రాంతం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఇద్దరు అదృశ్యమయ్యారు. ఆ మేరకు బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 17 సంవత్సరాల బాలిక, కర్నూలు జిల్లాలోని మరో బాలిక గతంలో స్నేహితులుగా ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఇటీవల కర్నూలుకు చెందిన బాలిక కోట మండలంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు బాలికలు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సీఐ హరికృష్ణ, ఎస్ఐ జి.పుల్లారావు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్నారు.

## పదిరోజులుగా కేసు ఎందుకు నమోదు చేయలేదు : ఎస్‌పి ఆగ్రహం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :గత నెల 21వ తేదీ భూ తగదాల్లో నిరుపేదలను గాయపరిచిన నిందితులపై ఇంత వరకూ కేసు ఎందుకు నమోదు చేయలేదని బైరెడ్డిపల్లె పోలీసులపై చిత్తూరు జిల్లా ఎస్.పి.రిశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 24 గంటల్లో కేసు నమోదు చేసిన తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. బైరెడ్డిపల్లె మండలం గడ్డూరు గ్రామంలో గత నెల 21వ తేదీ సర్వే నెంబరు 587/3లో 0.58 సంట్లు రాజమ్మ పేరు మీద వుంది. ఆ భూమిని కబ్జా చేయాలని ఆమె మరిది వైద్యం కృష్ణప్ప సర్పంచ్ దేవేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ పిచ్చిగుంట్ల నారాయణప్ప భూమిలో కూర్చుని మందుతాగుతూ అక్రమంగా భూమి ట్రాక్టర్‌తో దున్నేంచారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించనందుకు రాజమ్మ, ఆమె కుమారుడు ఆనంద వారి కుటుంబ సభ్యులపై దాడి చేసి, కమ్ములు, బంగారు నగలు, బొట్టు చైన్లు, తాళి బొట్లు తెంచుకుని దౌర్జన్యం చేశారు. ఆ సంఘటనపై ఆ రోజే బాధాతులు బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పదిరోజులైనా నిందితులపై ఇంత వరకూ ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహం చెందిన బాధితులు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్.పిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్.పి బైరెడ్డిపల్లె పోలీసులు ఆగ్రహంలో కేసు నమోదు చేయాలని సూచించారు.

## కల్లూరులో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీ

కల్లూరు, ఆగస్టు1ప్రభాతవార్త : పులిచెర్ల మండలం కల్లూరులోని జిల్లా పరిషత్ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ రా ్యలీని సోమవారం కల్లూరు పురవీధులలో నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థులు హర్‌గర్ తిరంగా అనే నినాదం వినిపించారు. నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి హర్‌ఘర్‌తిరంగా, భారత్ మాతా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దేశభక్తిని చాటుకున్నారు. స్వతంత్ర భారత దేశం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి భారతీయుడు సగర్వంగా జాతీయ పతాకాన్ని ఈనెల 13 నుంచి ఇంటిపై ఎగుర వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అహ్మద్,ప్రధానోపాధ్యాయులు పోకల తాతయ్య, ఉపాధ్యాయులు వనపర్తి వెంకటసిద్దులు, రాజేంద్రప్రకాష్, చలపతి, అమర్నాద్,జయచంద్ర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాయకులు పోరాట ఫలితమే సంపూర్ణ స్వాతంత్ర్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త : ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పట్టణంలోని బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంను పురస్కరించుకుని సోమవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిన విషయం విదితమే. ఈనేపధ్యంలో సోమవారం బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లోభాగంగా హార్‌ఘర్ తిరంగా నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించి త్రివర్ణపతాక రూపకర్త రూపొందించిన మువ్వన్నెల జెండా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయులు గోపాల్‌యాదవ్, దాము, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్కార్ఫ్‌డే ఉత్సవం

పుత్తూరురూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త: ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 1న ప్రపంచ స్కార్ఫ్ దినోత్సవంగా జరుపుకున్నారు. స్కౌట్స్‌అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బాడన్ పవల్ తన మొట్ట మొదటి స్కౌట్స్ క్యాంపును ఆగస్టు 1907లో ఇంగ్లండ్ దగ్గరగా ఉండే బ్రౌన్‌సీ ఐలాండ్‌లో నిర్వహించారు. ప్రపంచంలో స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థలో భాగస్వాములైన అందరూ ఈ ఆగస్టు 1న స్కార్ఫ్ ధరించి స్కౌట్స్ వ్యవస్థ పట్ల తమ బాధ్యతను అభిమానాన్ని చాటుకోవడంకై ఈ ఉత్సవాన్ని 2007 నుంచి ప్రారంభించడమైంది. చిన్న పిల్లలు మొదలు వయో వృద్ధులు వరకు ఎవరెవరు స్కౌట్స్‌గైడ్స్ యూనిఫారం ధరించి ఈ ఉద్యమంలో ఉన్నారో వారందరూ స్కార్ఫ్ ధరించి తమ అనుభవాలు పంచుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవాలన్నది ముఖ్య ఉద్దేశం. పుత్తూరు పట్టణంలో వెంకటేశ్వరులు స్కౌట్స్ మాస్టర్ ఆధ్వర్యంలో ఈ పండుగ నిర్వహించారు. ఈ ప్రపంచ స్కార్ఫ్‌డే ఉత్సవానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక మంత్రి రోజా, మున్సిపల్ కమిషనర్, చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, శంకర్‌లు పాల్గొన్నారు. స్కౌట్స్‌గైడ్స్ వారికి స్కార్ఫ్‌లు వేసి ఉత్సాహంగా ప్రపంచ స్కార్ఫ్ దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ లీడర్ కుమార్, లోకేష్, హేమాద్రి, భరత్ గైడ్స్ లీడర్ యువశ్రీ శైలజ, భువనేశ్వరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 1 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం కల్యాణవేంకన్న ఆలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవ వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిసింది. టిటిడి అధికారులు ఈ ఉత్సవాలను 10రోజుల పాటు నిర్వహించారు. చివరిరోజు సోమవారం ఆలయంలో శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేసిన తర్వాత అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం పురవీధుల్లో ఆండాల్ అమ్మవారు సమేత కల్యాణవేంకటేశ్వరున్ని తిరుచ్చివాహనంపై అదిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. స్వామి,అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

## ఇష్టమైన రంగాల్లో లక్ష్యాలను ఎంచుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు

తిరుపతి (విద్య), ఆగస్టు 1 ప్రభాతవార్త: విద్యార్థినులు వారికి ఇష్టమైన రంగాలను ఎంచుకుని ప్రణాళికా ప్రకారం శ్రమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని టిటీడీ జేఈవో సదా భార్గవి అన్నారు. ఆమె సోమవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో జరిగిన. డిగ్రీ, పీజీ కళాశాల 70వ వార్షికోత్సవంలో ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థినులు పలు సూచనలు చేశారు. అలాగే సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకుపోవడంతోపాటు విద్యాను ప్రోత్సహిస్తున్న ఏకైక సంస్థ టిటీడీ మాత్రమేనన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఇటీవల కాలంలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని విద్యార్థినీలను అభినందించారు. ముఖ్య అతిధి ఎస్వియూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు రావడం గర్వకారణం అన్నారు. స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో టిటిడి విద్యాశాఖాధికారి గోవిందరాజన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహదేవమ్మ, ప్రొఫెసర్ భువనేశ్వరి, కళాశాల కౌన్సిల్ అధ్యక్షురాలు అంజుమన్ రెహమాన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# శేష వాహనంపై ద్రౌపదీదేవి

పుత్తూరురూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి శ్రీ ధర్మ రాజుస్వామి తిరుణాల సందర్భంగా సోమవారం ద్రౌపదీదేవి ధర్మరాజు స్వామి శేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి, స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. అనం తరం ఉదయం 9 గంటలకు ఉత్సవం కార్య క్రమం, సాయంత్రం 4 గంటలకు ఈదుం బాసురబకాసుర వధ కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమాలు పుత్తూరు దళితవాద సంఘం వారిచే నిర్వహించారు. రాత్రి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాలు నడుమ శేష వాహనంపై స్వామివారిని అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా కీర్తిశేషులు కె.విశ్వనాథపిళ్లె(ఎక్స్‌కేఎం) కుమారులు కీర్తిశేషులు కె.సుదర్శనంపిళ్లె, కె.కుమార్ కర్ణం బాలాజీ, కె.హరినాథ్‌లు వ్యవహరించారు. ఉదయం, సాయంత్రం గెరిగె పురవీధుల్లో ఊరేగిం చారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

**నేడు ఆలయంలో కార్యక్రమాలు**

శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుస్వామి తిరుణాల సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు పల్లకిసేవ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు పి.వి.అరుణాచలం, మాజీ ఉపకులపతి ద్రవిడ విశ్వ విద్యాలయం కుప్పం వారిచే ఆధ్యాత్మిక ఉపన్యాసం అలాగే గీతామందిరం వారిచే అన్నమయ్య సంకీర్తనలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి కల్యాణోత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ లారీ మోహన్ తెలిపారు.

# సంక్షేమ పథకాలను అందించని ప్రభుత్వమెందుకు?

**-తహశీల్దార్ కార్యాలయం వద్ద తెదేపా నిరసన**

శ్రీకాళహస్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త : నిరుపేదల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించని ప్రభుత్వ మెందుకని పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు అన్నారు. సోమవారం తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చమనాయుడు సూచనల మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 16వేలకోట్లు లోటు బడ్జెట్ ఉన్న ప్రతి పేదవానికి అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని అలాగే సంక్రాంతికానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు ఇవ్వడం జరిగిందన్నారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇలాంటి వాటికి కోతపెట్టారని సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తూ రేషన్‌షాపుల డీలర్లను తొలగిస్తామని నాణ్యమైన సరుకులను పేదవానికి అందకుండా చేస్తూ అనేక కారణాలు చెప్పి పేదవాని రేషన్‌కార్డులు తొలగిస్తూ నాణ్యమైన ఉచిత బియ్యాన్ని కొందరికే ఇవ్వడం జరుగుతోందన్నారు. రేషన్‌డీలర్లను కొనసాగించాలని లేదంటే ఉచిత బియ్యాన్ని అందరికీ ఇవ్వాలని రేషన్ డీలర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ జరీనాకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కంటారమేష్, ప్రకాష్‌రావు, షాకిరాలీ, నెమళ్ళూరుసుబ్రమణ్యం, కెవిప్రతాప్, సుబ్బయ్య, జిలానీబాష, రాజేందర్‌నాయుడు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రావు, డివి.నారాయణ, ఖాదర్‌బాష, ఎంఎస్‌రెడ్డి, కిట్టు, మునిరాజయాదవ్, షఫి, సంపత్, కరీం, ఖలీల్, అస్మత్, సాయి, వినయ్, డిల్లీబాబు, శ్రీనివాసులు, మస్తాన్, ధనంజయులునాయుడు, మురళీ, దొరబాబు, రమేష్, భాస్కరయ్య, యాదగిరి, దుర్గా, కుమారి, సునిత, మణి, సుబ్రమణ్యంశెట్టి పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో టీడీపీ ధర్నా

సూళ్లూరుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : రాష్ట్రంలో రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ మాట్లాడుతూ రేషన్ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్న ప్పటికీ దాన్ని తొలగించి ప్రస్తుత ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రేషన్ వ్యవస్థ ఉన్నప్పుడు లబ్ధిదారులు నెలలో 15 రోజులు ఎప్పుడైనా వెళ్లి రేషన్ తెచ్చుకునే వారని, కానీ ప్రస్తుతం ఉన్న రేషన్ వ్యవస్థ వల్ల ఇంటింటికి రేషన్ అనే నినాదం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఇష్టం వచ్చిన రీతిలో ఏదో ఒక రోజు, ఏదో ఒక సమయంలో రేషన్ ఇస్తున్నారని తెలిపారు. నిజమైన లబ్దిదారులను గుర్తించి రేషన్ వ్యవస్థ ద్వారా న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ కె.రవికుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అలవల శ్రీనివాసులు, ఏజీ కిషోర్, కుదిరి పెంచలయ్య, పి.రాధాకృష్ణ, పి.సుబ్బయ్య, వెంకటస్వామి, ఎన్వి రమణయ్య, చిట్టేటి పెరుమాళ్లు, సత్యనారాయణరాజు, మునస్వామి, సురేష్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## కొండపై మరింత ఆధ్యాత్మికత !

**-మొదలైన అఖండహరినామసంకీర్తన**



తిరుమల,ఆగస్టు 1 ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల కొండపై ఇకపై మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడనుంది. ఇందుకు కల్యాణకట్ట సమీపంలోని అఖండ హరినామ సంకీర్తన కేంద్రంలో భజనలు, జానపద భక్తి కీర్తనలు మొదలయ్యాయి. రెండేళ్ళుగా ఆగిన ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పునరుద్ధరించారు. నిరంతరాయంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడ భజనలు జరుగుతాయి.

## అమ్మవారికి గాజులు,దారాలు కానుక!



తిరుచానూరు,ఆగస్టు 1 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారికి తిరుపతికి చెందిన దంపతులు షణ్ముగం,షర్మిల 2 వేల డజన్ల మట్టి గాజులు,10 వేల పసుపు దారాలు,5 వేల కంకణాలు కానుకగా అందచేశారు.సోమవారం వీరు ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,అర్చకులు బాబుస్వామి,పేష్కార్ ప్రభాకర్, సూపరింటెండెంట్ మధు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాములకు అందచేశారు.అనంతరం దాతలు మాట్లాడుతూ త్వరలో రాబోవు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తాము అమ్మవారికి ఈ చిరు కానుక అందచేశామన్నారు.

## అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి

కోట,ఆగస్టు 1ప్రభాతవార్త : తూర్పు రాయలసీమ వైకాపా అభ్యర్థి (చిత్తూరు,నెల్లూరు, ప్రకాశం) పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి సోమవారం తాడేపల్లి సిఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కుటుంబసమేతంగా కలిశారు. సిఎంకు పుష్ప గుచ్ఛాన్ని అందచేసి శాలువాతో సన్మానించారు. ముఖ్యమంత్రి శ్యామ్ ప్రసాద్ రెడ్డితో మాట్లాడుతూ అందరిని సమన్వయం చేసుకొంటూ ముందు కెళ్లాని సూచించారని చెప్పారు. ఆమేరకు ఆయన తాడేపల్లి నుంచి ప్రభాతవార్తతో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపానన్నారు. ఊపిరి ఉన్నంత వరకు జగనన్నకు అండగా సైనికులుగా పనిచేసేందకు ఎల్లప్పుడు సిద్దంగా ఉంటామన్నారు. తన సతిమణీ హేమ సుష్మిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి సారిగా ముఖ్యమంత్రిని ఆమె కూడా కలిశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ రీసెర్చ్ శిక్షణ కేద్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయక్తంగా నిర్మించబోవు యూనిట్‌కు సంబధించిన శంకుస్థాపన చేయాలని కోరినట్లు తెలిపారు. శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తో పాటు సిద్దవరం సొసైటి చైర్మెన్ రాధకృష్ణారెడ్డి కూడా ఉన్నారు.

## ప్రజలపై పన్నుల భారం

**- ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు**



బంగారుపాళ్యం, ఆగస్టు 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని పన్నుల భారం వేస్తోందని శాసన మండలి సభ్యులు బిఎన్.రాజసింహులు పేర్కొన్నారు. సోమవారం బాదుడే బాదుడు కార్యక్రమంను బొమ్మాయిపల్లి, కురవపల్లి, తిమ్మోజిపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ పన్నుల రూపంలో ప్రజలపై భారీ మొత్తంలో పన్నులు విధిస్తోందని ఆరోపించారు. విద్యుత్, బస్సు ఛార్జీలు మరింతగా పెంచారన్నారు. నవరత్నాలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్‌నాయుడు, జనార్ధన్‌గౌడులు, నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, రమేష్, గిరిబాబు, నాగరాజు, అరవిందబాబు, రాధాకృష్ణ, నీరజాక్షులుగౌడు, రాజేంద్రనాయుడు, హేమచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కొత్త పెన్షన్లు పంపిణీ**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పెన్షన్లను బంగారుపాళ్యం సచివాలయంలో మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా నూతనంగా మంజూరు అయిన పెన్షన్లను లబ్దిదారులకు అందజేశారు. నూతనంగా మండలంలో 800 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు.సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కామరాజు, ఎంపిటిసీ ఉషారాణి, మాజీ సర్పంచ్ కృష్ణ మూర్తి, కార్యదర్శి శంకరయ్య, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసు స్పందనకు 30 సమస్యలు

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంకు జిల్లా నలుమూలల నుండి 30 సమస్యలను ఎస్పీ రిశాంతరెడ్డికి విన్నవించారు. ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30 మంది ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిశీలించిన ఎస్పీ సత్వరం స్పందన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## కొత్తగా 1,127 మందికి పెన్షన్లు

చిత్తూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త: చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో కొత్తగా 1,127 మందికి పెన్షన్లు మంజూరు అయ్యాయని కమిషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో అర్హులైన లబ్దిదారులకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ కానుక మొత్తాలను సోమవారం ఉదయం 5 గంటల నుండి వార్డు వాలంటీర్లు పంపిణీ చేశారన్నారు. సోమవారం చిత్తూరు నగర పరిధిలో 89 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామన్నారు. 39వ డివిజన్‌లో మేయర్ అముద కొత్తగా పెన్షన్ మంజూరైన లబ్దిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు.

## శివాలయంలో పూజలు నిర్వహించిన మంత్రి రోజా



పుత్తూరురూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త: రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసుల క్రీడాశాఖ మాత్యులు రోజా పుత్తూరు సదాశివేశ్వర ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో పూజారులు వేదమంత్రాల మధ్య మంత్రి రోజాని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరులో సోమవారం ఏటీఎం లేక ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని గమనించి అత్యవసర పరిస్థితుల్లో నగదు అవసరాన్ని గుర్తించి ఇండియన్ వన్ ఏటీఎం యూనిట్‌ను మంత్రి రోజా ప్రారంభించారు.

## కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాల ఆహ్వాన, గోడపత్రికల ఆవిష్కరణ



కాణిపాకం, ఆగస్టు 1 ప్రభాతవార్త: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవ స్థానంలో జరుగనున్న ప్రధాన మహా కుంభాభిషేకం, వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ముద్రించిన గోడపత్రిక, ఆహ్వానపత్రికలు, బ్రోచర్‌లను సోమ వారం పూతలపట్టు ఎమ్మెల్యే బాబు ఆవిష్కరిం చారు. కాణిపాకం దేవస్థానంలో ఈనెల 21న ప్రధాన ఆలయ మహాకుంభాభిషేకం, 31 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.ఆలయ ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చ కులు ధర్మేశ్వరగురుకుల్, ముఖ్య అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానిక సర్పంచ్ కెఎస్. శాంతి సాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, ఉభయదారులు